

బాలికా...బెంగలేదిక..!
బాలికల రక్షణకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది. నేడు జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం. 8లో



జీ-20 సదస్సుకు భద్రత
జీ-20 సదస్సుకు భారీ భద్రతా ఏర్పాట్లపై నగర పోలీస్ శాఖ దృష్టి సారించింది. పలు పర్యాటక ప్రాంతాలను సీపీ శ్రీకాంత్ సందర్శించారు. 8లో



పోర్టులో పుష్ప
షిప్‌యార్డ్, పోర్టు ప్రాంతాల్లో పుష్ప-2 షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. స్టైలిష్ స్టార్ అల్లు అర్జున్ సందడి చేశాడు. 8లో

న్యూస్‌రీల్

సాక్షి ఆధ్వర్యంలో రేపు బీచ్ క్లీనింగ్

మహారాణిపేట : భవిష్యత్తు తరాలకు ఆకుపచ్చని, పరిశుద్ధమైన, ఆరోగ్యదాయకమైన, జీవనయోగ్యమైన భూగోళాన్ని అందించాలంటే ఇప్పుడు మన ఆలోచన మారాలి. అనుదిన జీవనంలో గుణాత్మక మార్పు రావాలి. ప్రజల్లో ఈ స్పృహను కలిగించే దిశగా సాక్షి మీడియా గ్రూప్ కదులుతోంది. ప్రకృతి ప్రేమికులు, సామాజిక సేవకుల సహకారంతో ఈనెల 25న ఉదయం 6 గంటలకు తెన్నేటి పార్కు వద్ద బీచ్ క్లీనింగ్ కార్యక్రమం చేపట్టనుంది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున, జీవీఎంసీ కమిషనర్ రాజాబాబు, నగర పోలీసు కమిషనర్ సిహెచ్ శ్రీకాంత్‌తో సహా పలువురు ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొంటారు. ఈ కార్యక్రమంలో పాల్గొనే వారు తమ పేర్లను https@//swatchvizag.in.// వెబ్ పోర్టల్‌లో నమోదు చేసుకోవచ్చు.

కౌలాలంపూర్‌కు కొత్త విమానం

గోపాలపట్నం: విశాఖపట్నం నుంచి కౌలాలంపూర్(మలేషియా)కు విమాన సర్వీసు మార్చిలో ప్రారంభం కానుంది. బాటిక్ సంస్థ ఈ సర్వీస్ నడపనుంది. రెండు రోజుల్లో ఈ సర్వీస్ షెడ్యూల్ విడుదల కానున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం వైజాగ్ నుంచి సింగపూర్‌కు సర్వీసు నడుస్తున్న సంగతి తెలిసిందే. ఏడేళ్ల క్రితం మలిండో విమానయాన సర్వీస్ విశాఖ-కౌలాలంపూర్ మధ్య నడిచేది.

నిబంధనల ప్రకారమే స్టాఫ్ నర్సుల నియామకం

మహారాణిపేట(విశాఖ దక్షిణ): స్టాఫ్ నర్సుల నియామకాలు ప్రభుత్వ నియమ నిబంధనలు, మార్గదర్శకాలను అనుసరించి భర్తీ చేసినట్లు వైద్య ఆరోగ్య శాఖ ప్రాంతీయ డైరెక్టర్ డాక్టర్ ఎన్.ఉమాసుందరి తెలిపారు. సర్వీసు వెయిటేజీ, ఇతర సంబంధిత అర్హతలు పరిశీలించి నియమకాలు చేశామని ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

ఫారం 6, 23 డౌన్‌లోడ్ చేసుకోండి..

గోపాలపట్నం : వాహనాల ఆర్‌సీ, లైసెన్స్ స్మార్ట్ కార్డుల పంపిణీలో జాప్యం జరుగుతున్న నేపథ్యంలో ఆన్‌లైన్ ద్వారా ఫారం 6, ఫారం 23 డౌన్‌లోడ్ చేసుకొని డిజిటల్ రూపంలో వాడుకోవచ్చని ఉప రవాణ కమిషనర్ రాజారత్నం తెలిపారు. 31 మార్చి 2022 వరకు ఆర్‌సీ కార్డు, 30 నవంబర్ 2021 వరకు లైసెన్స్‌లను స్పీడ్ పోస్టులో పంపించినట్లు పేర్కొన్నారు. కార్డుల స్టాక్ వచ్చిన తరువాత మిగతావి ప్రింటింగ్ చేసి పోస్టు ద్వారా పంపిస్తామన్నారు. అప్పటి వరకు రవాణా శాఖ వెబ్ సైట్ https://aprtacitizen.epragathi.orgలో ఫారం 6, ఫారం 23 డౌన్‌లోడ్ చేసుకొని వాటిని అధీకృత పత్రంగా వాడుకోవాలని సూచించారు. వాటిని డిజిటల్ రూపంలో రవాణా శాఖ, పోలీస్ శాఖ అధికారులకు చూపించవచ్చని తెలిపారు.

రేపు జాబ్‌మేళా

కంచరపాలెం : స్థానిక జిల్లా ఉపాధి కార్యాలయం నేషనల్ కెరీయర్ సర్వీస్ సెంటర్‌లో బుధవారం జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా సబ్ రీజినల్ ఎంప్లాయిమెంట్ (ఎస్సీ, ఎస్టీ) అధికారి నిట్టాల శ్యామ్‌సుందర్ తెలిపారు. అపోలో ఫార్మసీ ప్రైవేటు లిమిటెడ్ కంపెనీలో 100 ఖాళీలను భర్తీకి చేయనున్నట్లు పేర్కొన్నారు. ఫార్మసిస్ట్, ఫార్మసి అసిస్టెంట్ ఉద్యోగాలకు ఇంటర్మీడియేట్, ఏదైనా డిగ్రీ, డీ/బీ/ఎమ్ ఫార్మసీల్లో ఉత్తీర్ణత సాధించి 18–30 సంవత్సరాల వయసు కల్గిన పురుష, మహిళా అభ్యర్థులు అర్హులన్నారు. ఆయా ఉద్యోగాలకు జీతం నెలకు రూ.10,000 నుంచి రూ.16,000 ఉంటుందన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ncs.gov.in వెబ్‌సైట్‌లో పేర్లు రిజిస్టర్ చేసుకోవాలని సూచించారు.

ఫిబ్రవరి నుంచి రేషన్‌లో గోధుమ పిండి

మహారాణిపేట : ఫిబ్రవరి నుంచి రేషన్‌కార్డులపై గోధుమ పిండి పంపిణీ చేయాలని పౌరసరఫరాల శాఖ నిర్ణయించింది. ప్రస్తుతం ఉచితంగా బియ్యం, సబ్సిడీ ధరలపై కందిపప్పు, చక్కెర పంపిణీ చేస్తున్నట్టు డీఎస్‌వో జి.సూర్యప్రకాశరావు చెప్పారు. ఒక్కొక్క కార్డుకు రెండు కిలోల చొప్పన సబ్సిడీపై సరఫరా చేస్తామన్నారు. కిలో రూ.16లు చొప్పన ఇస్తామన్నారు.

డైరీ, ప్లానర్లు విడుదల

మహారాణిపేట : ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ అధికారుల సంఘం విశాఖ జిల్లా యూనిట్ ఫ్లాంట్ డాక్టర్స్ డైరీ – 2023, ప్లానర్లను కలెక్టరేట్‌లో కలెక్టర్ డాక్టర్ మల్లికార్జున సోమవారం విడుదల చేశారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి డాక్టర్ అప్పలస్వామి, ఏపీ వ్యవసాయ అధికారుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ బొడ్డేపల్లి విజయప్రసాద్, జిల్లా కార్యదర్శి డాక్టర్ నవీన్ జ్ఞానమణి, పలువురు వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు.

సాగర జలాల స్కానింగ్!

- సముద్ర నీటి నాణ్యతపై స్పష్టత
- ఇంకా మరెన్నో విషయాలు తెలిసే వీలు
- ఇందుకోసం ఆర్కే బీచ్ సమీపంలో 'బుయ్' ఏర్పాటు
- దీని నుంచి వచ్చే డేటా శాటిలైట్‌తో అనుసంధానం
- ఆ సమాచారాన్ని ఆర్కే బీచ్‌లో డిస్‌ప్లేకు చర్యలు
- రాష్ట్రంలో ఇలాంటిది ఇదే తొలిసారి
- ఏయూ జువాలజీ విభాగంలో రీసెర్చ్ ల్యాబ్



సముద్రంలో ఏర్పాటు చేసిన బుయ్

సాక్షి, విశాఖపట్నం: సముద్రంలో నీటి నాణ్యత, స్వచ్ఛత ఎలా ఉంటుంది? సముద్ర కాలుష్యం ఎంత? సాగర జలాల్లో ఎలాంటి మార్పులు చోటు చేసుకుంటున్నాయి? ఉష్ణోగ్రతల తీరుతెన్నులు? గాలి వేగం ఎంత? వంటి ఎన్నో విశేషాలను ఇకపై నిత్యం ప్రత్యక్షంగా చూడొచ్చు. ఇలాంటి సమాచారాన్ని అందించేందుకు ఆర్కే బీచ్ సమీపంలో సముద్రంలో వాటర్ క్వాలిటీ మానిటరింగ్ బుయ్ అందుబాటులోకి వచ్చింది. దీనిని ఇటీవల నేషనల్ సెంటర్ ఫర్ కోస్టల్ రీసెర్చి (ఎన్‌సీసీఆర్) ఏర్పాటు చేసింది. ఇలాంటి బుయ్‌లు ఇప్పటివరకు దేశంలోని ఆరు తీర ప్రాంత రాష్ట్రాల సముద్ర జలాల్లో ఉన్నాయి. విశాఖలో ఏర్పాటైనది ఏడవది. ఈ బుయ్‌ని చెన్నై నుంచి ఎన్‌సీసీఆర్‌కు చెందిన సాగర్ తార అనే నౌకలో తీసుకొచ్చారు.

బుయ్ పనితీరు ఇలా..

ఈ బుయ్‌ని ఆర్కే బీచ్‌కు సుమారు 800 మీటర్ల దూరంలో అలలపై తేలియాడేలా అమర్చారు. ఇది కెరటాల ఉధృతికి కొట్టుకుపోకుండా దిగువన సిమెంట్ దిమ్మెలను ఏర్పాటు చేసి గొలుసులతో కట్టారు. వీటికుండే సెన్సార్లు సముద్రంలో నీటి నాణ్యత, గాఢత, ఉప్పు శాతం, కాలుష్య శాతం, ఆక్సిజన్, ఉష్ణోగ్రతలు, గాలి ఒత్తిడి, వేగం, సాగర జలాలు ఎంత మట్టితో ఉన్నాయి? సముద్రం ఎంత అలజడిగా ఉంది? మత్స్య సంపద వృద్ధికి దోహదం చేసే క్లోరోఫిల్ (సముద్రంలో పత్రహరితం) ఎంత మేర ఉంది? వంటి సమాచారాన్ని ఈ సెన్సార్లు నిక్షిప్తం చేస్తాయి. ఆ డేటాను శాటిలైట్‌కు పంపిస్తారు. అక్కడ నుంచి ఆ సమాచారం ఇక్కడ కంప్యూటర్‌లోకి వస్తుంది. ఆ డేటాను పబ్లిక్ డొమైన్‌లో ఉంచుతారు. మరోవైపు ఆర్కే బీచ్‌లో ఈ సమాచారం ప్రజానీకానికి తెలిసేలా ప్రత్యేకంగా డిస్‌ప్లే బోర్డు ఏర్పాటు చేస్తారు. దీంతో సముద్రంలో ఎప్పటికప్పుడు మారుతున్న పరిణామాలను తెలుసుకునే అవకాశం ఉంటుంది. నగరంలో కాలుష్య తీవ్రతను తెలియజేసేందుకు జీవీఎంసీ వద్ద కాలుష్య నియంత్రణ మండలి ఏర్పాటు చేసిన మాదిరిగానే ఇది కూడా ఉంటుంది.

కచ్చితత్వం కోసం కసరత్తు

ఆంధ్ర విశ్వవిద్యాలయం మెరైన్ లివింగ్ రిసోర్స్ (ఎంఎల్ఆర్) విభాగానికి కేంద్ర భూ శాస్త్ర విజ్ఞాన, పర్యావరణ మంత్రిత్వ శాఖ నేతృత్వంలోని ఎన్‌సీసీఆర్ ఈ ప్రాజెక్టును మంజూరు చేసింది. బుయ్ నుంచి వచ్చే సమాచారం కచ్చితత్వంపై ఎంఎల్ఆర్ నిపుణులు ఫిజికల్‌గా మరోసారి పరీక్షిస్తారు. ఒకవేళ తేడా వస్తే సంబంధిత సెన్సార్లను మారుస్తారు. అలాగే సముద్రంలో హానికర బ్యాక్టీరియా ఉన్నా, సముద్ర స్నానాలు చేసే వారి ఆరోగ్యాన్ని దెబ్బతీసేలా సాగర జలాలున్నట్టు గుర్తించినా ముందస్తుగా అప్రమత్తం చేస్తారు. ఈ బుయ్ ఏర్పాటు చేసిన ప్రాంతం మీదుగా పడవలు, నౌకలు, వెస్సెల్స్ వంటివి వెళ్లకుండా చర్యలు తీసుకునేలా మెరైన్ పోలీసులు, మత్స్యశాఖ, నేవీ, కోస్టుగార్డు, పోర్టు, సీఎంఎఫ్ఆర్ఐ అధికారులతో పాటు కాలుష్య నియంత్రణ మండలి అధికారులకు సమాచారం ఇచ్చారు.

'జువాలజీ'లో రీసెర్చ్ ల్యాబ్



బుయ్ పనితీరు, అది ఇచ్చే సమాచారాన్ని క్రోడీకరించడం కోసం ఏయూ జువాలజీ విభాగంలో ఫీల్డ్ రీసెర్చ్ లేబొరేటరీ ఏర్పాటు చేస్తాం. అందుకవసరమైన పరికరాలను కొనుగోలు చేస్తాం. సముద్రంలో చోటు చేసుకుంటున్న మార్పులకు సంబంధించి డేటా ప్రతి పది నిమిషాలకు లభిస్తుంది. మత్స్య ఉత్పత్తికి దోహదపడే ప్లవకాలు (సముద్ర నాచు) తగ్గుతున్నా తెలుస్తుంది. దానికనుగుణంగా ప్రభుత్వం చర్యలు తీసుకునే వీలుంటుంది. ఈ బుయ్ నిర్వహణ ఖర్చును ఎన్‌సీసీఆర్ భరిస్తుంది. నాతో పాటు ఎన్‌సీసీఆర్ నిపుణులు ప్రభాకర్ మిశ్రా, శివాజీ పాత్రో, చరణ్‌కుమార్ తదితరులు ఈ బుయ్ పనితీరును పర్యవేక్షిస్తారు.

–జానకీరాం,
ప్రిన్సిపల్ ఇన్వెస్టిగేటర్, ఎంఎల్ఆర్, ఏయూ


ఒకే అడ్రస్.. మూడు నర్సింగ్ కాలేజీలు?

- ఫీజులు చెల్లించినా హాల్ టికెట్లు ఇవ్వని నిర్వాహకులు
- విద్యార్థినులతోనే హాస్టల్‌లో పనులు
- వైఎస్సార్‌సీపీ అధికార ప్రతినిధి రాజీవ్‌గాంధీ నిలదీయడంతో వెలుగులోకి వాస్తవాలు
- కళాశాల ప్రిన్సిపాల్‌పై లైంగిక వేధింపుల ఆరోపణలు
- నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని విద్యార్థినులు డిమాండ్



మోహన్‌కృష్ణ కాలేజ్ ఆఫ్ నర్సింగ్

దొండపర్తి(విశాఖ దక్షిణ): ఒకే అడ్రస్‌పై మూడు నర్సింగ్ కళాశాలలు.. విద్యార్థినులతోనే హాస్టల్‌లో పనులు.. ఫీజులు చెల్లించినా హాల్ టికెట్లు ఇవ్వకుండా ఇబ్బందులు.. గతంలో కళాశాల ప్రిన్సిపాల్‌పై లైంగిక వేధింపుల ఆరోపణలు.. ఇలా ఒకటి కాదు.. రెండు కాదు.. నగరంలో ఒక నర్సింగ్ కాలేజీ నిర్వాహకంపై ఎప్పటికప్పుడు వివాదాలు ముసురుతూనే ఉన్నాయి. తాజాగా విద్యార్థినులకు హాల్ టికెట్లు ఇవ్వకుండా వేధిస్తున్న వ్యవహారంపై వైఎస్సార్‌సీపీ అధికార ప్రతినిధి కొండా రాజీవ్‌గాంధీ కళాశాల ఉద్యోగులను నిలదీయగా.. అనేక సందేహాలు, మరిన్ని వివాదాలు వెలుగులోకి వచ్చాయి.



ఫీజులు చెల్లించినట్లు ఇచ్చిన స్లిప్పులు

హాల్ టికెట్లు ఇవ్వకుండా..

షీలానగర్ ప్రాంతంలో ఉన్న మోహన్ కృష్ణ కాలేజీ ఆఫ్ నర్సింగ్ నిర్వాకంపై విద్యార్థినులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గతంలోనే ఫీజులు చెల్లిస్తే ఒరిజినల్ బిల్లులు ఇవ్వకుండా కేవలం స్లిప్పులు మాత్రమే ఇచ్చారని, ఇప్పుడు హాల్ టికెట్లు అడిగితే మళ్లీ ఫీజులు చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారని వాపోతున్నారు. గతంలో ఫీజులు చెల్లించినట్లు ఇచ్చిన స్లిప్పులు చూపించినా అంగీకరించడం లేదని ఆందోళనకు దిగారు.

వైఎస్సార్‌సీపీ అధికార ప్రతినిధిని ఆశ్రయించిన విద్యార్థినులు

కాలేజీ నిర్వాహకుల నిర్వాకంపై కొంత మంది విద్యార్థినులు వైఎస్సార్‌సీపీ అధికార ప్రతినిధి కొండా రాజీవ్ గాంధీని ఆశ్రయించారు. అలాగే తమ కాలేజీ, హాస్టల్‌లో ఇబ్బందులను సైతం అతడి దృష్టికి తీసుకువెళ్లారు. హాస్టల్‌లో సరైన సౌకర్యాలు కల్పించకపోగా.. లోపల పనులు కూడా తమతోనే చేయిస్తున్నారని వాపోయారు. పరీక్షల హాల్ టికెట్లు ఇప్పించాలని కోరారు. దీంతో కొండా రాజీవ్ కాలేజీకి వెళ్లి అక్కడి వారితో మాట్లాడితే అనేక విషయాలు వెలుగులోకి వచ్చాయి.

ఎట్టకేలకు హాల్‌టికెట్లు ఇచ్చిన నిర్వాహకులు

షీలానగర్‌లో ఉన్న మోహన్ కృష్ణ కాలేజీ ఆఫ్ నర్సింగ్‌లోనే మరో రెండు నర్సింగ్ కాలేజీల బిల్లులు ఉండడం గమనార్హం. మదర్ థెరిస్సా కాలేజ్ ఆఫ్ నర్సింగ్‌తో పాటు గ్లోబర్ స్కూల్ ఆఫ్ నర్సింగ్ పేరుతో బిల్లులు ఉన్నాయి. అయితే ఈ మూడు కాలేజీలు షీలానగర్ అడ్రస్ మీదే ఉండడం గమనార్హం. ఒకే అడ్రస్‌పై మూడు నర్సింగ్ కాలేజీలను నిర్వహిస్తున్నారా? లేదా ఒకే ప్రాంతంలో మూడు కాలేజీలు నడుపుతున్నారా? మూడు కాలేజీ బిల్లులు ఒకే చోట ఎందుకున్నాయి? అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. వీటన్నింటి నేపథ్యంలో కొండా రాజీవ్ కాలేజీ ఉద్యోగులను ప్రశ్నించగా వారు విద్యార్థినులకు వెంటనే హాల్ టికెట్లు అందజేశారు. ఇదిలా ఉంటే మదర్ థెరిస్సా నర్సింగ్ కాలేజీపై గతంలో అనేక ఆరోపణలు వెల్లువెత్తాయి. ఆ కళాశాల విద్యార్థినుల పట్ల ప్రిన్సిపాల్ లైంగిక వేధింపులకు పాల్పడినట్లు ఆరోపణలు ఉన్నాయి. తాజాగా ఫీజులు చెల్లింపులు, హాల్ టికెట్ల మంజూరు విషయంలో విద్యార్థుల ఆందోళన నేపథ్యంలో ఈ నర్సింగ్ కాలేజీల వ్యవహారం మరోసారి వివాదాస్పదమవుతోంది.

త్వరలో విశాఖ కేంద్రంగా పరిపాలన

- ప్రజల అభీష్టం మేరకే మూడు రాజధానుల నిర్ణయం
- టీటీడీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ రీజనల్ కోఆర్డినేటర్ వై.వి సుబ్బారెడ్డి



మీడియాతో మాట్లాడుతున్న టీటీడీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ రీజనల్ కోఆర్డినేటర్ వై.వి సుబ్బారెడ్డి

సాక్షి, విశాఖపట్నం: విశాఖ కేంద్రంగా త్వరలో పాలన జరుగుతుందని టీటీడీ చైర్మన్, వైఎస్సార్ సీపీ రీజనల్ కోఆర్డినేటర్ వై.వి సుబ్బారెడ్డి అన్నారు. ప్రజల అభీష్టం మేరకే మూడు రాజధానుల నిర్ణయం సీఎం వై.ఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకున్నారని, న్యాయ సమస్యలు తొలగిన మరుక్షణం నుంచి విశాఖ పరిపాలన రాజధాని కావడం తథ్యమన్నారు. సోమవారం విశాఖ ఎయిర్‌పోర్ట్‌లో ఆయన మీడియా మాట్లాడారు. రాష్ట్రంలో మూడు రాజధానులతోనే అభివృద్ధి జరుగుతుందని, ఎప్పటికీ పరిపాలన వికేంద్రీకరణే మా విధానమని పేర్కొన్నారు. వైఎస్సార్‌సీపీ మూడున్నరేళ్ల పాలనలో హామీలన్ని దాదాపు అమలుచేశామన్నారు. రానున్న ఎన్నికల్లో మళ్లీ వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రానుందని, ప్రజలందరూ సీఎంగా వై.ఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ రావాలని కోరుకుంటున్నారన్నారు.

ప్రతిష్టాత్మకంగా గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్, జి-20 సదస్సు

- రూ.200 కోట్లతో నగర సుందరీకరణ
- అంతర్జాతీయ సదస్సులతో రాష్ట్రానికి ఎంతో మేలు
- పారిశ్రామికవేత్తలతో మంత్రి అమర్‌నాథ్



మాట్లాడుతున్న మంత్రి అమర్‌నాథ్, కలెక్టర్ మల్లికార్జున, హాజరైన పరిశ్రమల యాజమాన్య ప్రతినిధులు

మహారాణిపేట (విశాఖ దక్షిణ) : మార్చిలో విశాఖలో జరగనున్న రెండు అంతర్జాతీయ సదస్సులను విజయవంతం చేసేందుకు వివిధ పరిశ్రమల యాజమాన్యాలు సహకరించాలని రాష్ట్ర పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ విజ్ఞప్తి చేశారు. అనకాపల్లి, విశాఖ జిల్లాలకు చెందిన భారీ పరిశ్రమల ప్రతినిధులతో సోమవారం స్థానిక జిల్లా పరిషత్ సమావేశ భవనంలో ఏర్పాటు చేసిన కన్సల్టెంట్ కమ్ ఇంటరాక్షన్ మీట్‌లో మంత్రి మాట్లాడారు. మార్చి 3, 4 తేదీల్లో గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ సదస్సు విశాఖలో నిర్వహించనున్నామని, అదే నెల 28, 29, 30వ తేదీల్లో భారతదేశం నాయకత్వం వహిస్తున్న జీ-20 సదస్సు విశాఖలో అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్నట్టు చెప్పారు. ఈ సమావేశానికి 45 దేశాలకు చెందిన సుమారు 250 మంది ప్రతినిధులు పాల్గొంటారన్నారు. ప్రపంచ ప్రాముఖ్యత కలిగిన ఈ సదస్సుకు రాష్ట్ర ప్రభుత్వం ఆతిథ్యమివ్వటం మనమంతా గర్వించదగ్గ విషయమన్నారు. ఈ సదస్సును విజయవంతం చేయడం ద్వారా రాష్ట్రానికి ఎన్నో ప్రయోజనాలు చేకూరనున్నాయని చెప్పారు. ప్రపంచ ఆర్థిక రంగంలో 75% ఆదాయాన్ని సమకూర్చుతున్న దేశాల ప్రతినిధులు ఈ సదస్సుకు హాజరు కానున్నారన్నారు. నగర సుందరీకరణ పనులు శాశ్వత ప్రాతిపదికన పనులు జరగాలని అధికారులను ఆదేశించారు. వీటిలో ఏ పనులనైనా పరిశ్రమల యాజమాన్యాలు తీసుకుని పూర్తి చేయవచ్చని సూచించారు. ఆర్కే బీచ్ నుంచి భీమిలి వరకు ఉన్న రహదారి అభివృద్ధి చేయడం, నగరంలో ఉన్న పర్యాటక కేంద్రాలను విదేశీయులను ఆకట్టుకునే విధంగా తీర్చిదిద్దడం వంటి పనులు శరవేగంగా చేపట్టాలన్నారు. అలాగే అరకు కాఫీ మ్యూజియం వంటి అనేక పర్యాటక ప్రదేశాలను సుందరీకరించాలని కోరారు. కలెక్టర్ మల్లికార్జున మాట్లాడుతూ రాష్ట్ర సంస్కృతీ, సంప్రదాయాలు ప్రపంచానికి తెలిసే విధంగా సుందరీకరణ పనులు జరగాలని పరిశ్రమల యాజమాన్య ప్రతినిధులను కోరారు. రాష్ట్ర ప్రభుత్వం, జీవీఎంసీ కలిసి సుమారు రూ.200 కోట్లతో ఈ సుందరీకరణ పనులు చేయనున్నట్టు చెప్పారు. నగరంలో సుమారు 148 కి.మీ రోడ్లను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయనున్నామని, విద్యుదీకరణ, సుందరీకరణకు సంబంధించి సుమారు 150 పనులు చేపట్టనున్నామని వివరించారు. కేంద్ర ప్రభుత్వం కూడా విశాఖ సదస్సును ప్రతిష్టాత్మకంగా తీసుకున్న నేపథ్యంలో వివిధ పరిశ్రమల యాజమాన్యాలు నగరాభివృద్ధిలో కీలకపాత్ర పోషించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో అనకాపల్లి, విశాఖ జిల్లాల్లో ఉన్న భారీ పరిశ్రమల యాజమన్య ప్రతినిధులు పాల్గొన్నారు.

ఒకే వేదికపై ఇద్దరు పీఠాధిపతులు

స్వాములను చూసేందుకు పోటీ పడ్డ భక్తులు



లలితాపీఠంలో శ్రీసిద్ధేశ్వరానంద మహా భారతి మహాస్వామి, శ్రీశంకర విజయేంద్ర సరస్వతి మహాస్వామి

సీతంపేట (విశాఖ ఉత్తర): కుర్తాళం, శ్రీలలితా పీఠాధిపతులు శ్రీసిద్ధేశ్వరానంద మహా భారతి మహాస్వామి, కంచి కామకోటి పీఠాధిపతి శ్రీశంకర విజయేంద్ర సరస్వతి మహాస్వామి ఒకే వేదికపై భక్తులకు దర్శనమిచ్చారు. విశాఖలో ఇలా ఒకే వేదికపై ఇద్దరు పీఠాధిపతులు దర్శనమివ్వడం ఇదే మొదటిసారి. ఈ అద్భుత ఘట్టానికి లలితాపీఠం వేదికైంది. స్వాములిద్దరినీ చూడటానికి భక్తులు పోటీ పడ్డారు. భక్తుల జయ జయ శంకర ధ్వానాలతో లలితాపీఠం మార్మోగింది. కుర్తాళం, లలితాపీఠాధిపతి శ్రీసిద్ధేశ్వరానంద మహా భారతి మహాస్వామి 87వ జన్మదినోత్సవం సందర్భంగా లలితాపీఠంలో జరుగుతున్న చతుర్దశాహ్నిక అష్టముఖ గండభేరుండ జ్వాలా నారసింహ సుదర్శన మహా యాగం, స్వామి వారి జన్మదినోత్సవ ప్రారంభ వేడుకకు కంచి పీఠాధిపతి శంకర విజయేంద్ర సరస్వతి విచ్చేశారు. శంకర మఠం నుంచి లలితాపీఠం వరకు స్వామి ఊరేగింపుగా వచ్చారు. భక్తులు అడుగడుగునా హారతులు పట్టారు. లలితాపీఠం ప్రతినిధులు పూర్ణకుంభం, మేళతాళాలతో ఘన స్వాగతం పలికారు. లలితా అమ్మవారిని దర్శించి పూజలు చేశారు. అనంతరం లలితాపీఠం దర్బార్‌హాల్లో పలు రకాల పండ్లతో అలంకరించిన వేదికపై సిద్ధేశ్వరానంద భారతి మహాస్వామితో కలిసి భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులను ఉద్దేశించి అనుగ్రహ భాషణం చేశారు. ఈ కార్యక్రమంలో శక్తి పీఠాధీశ్వరి రమ్యానంద భారతీ స్వామి, సిద్ధేశ్వరి పీఠం సీఈవో మోచర్ల శశిభూషణ్, కుర్తాళం పీఠం ఆస్థాన వేద పండితులు మాచవోలు రమేష్‌శర్మ, లలితాపీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

మత్తు ఇంజక్షన్ల ముఠా అరెస్ట్



స్వాధీనం చేసుకున్న ఇంజక్షన్లు



నిందితులతో సెబీ అధికారులు

మర్రిపాలెం (విశాఖ ఉత్తర): మత్తు ఇంజక్షన్లు విక్రయిస్తున్న నలుగుర్ని గోపాలపట్నం సెబీ స్టేషన్ పరిధిలో స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అధికారులు అరెస్టు చేశారు. ఎన్ఎస్‌టీఎల్ గేటు వద్ద మత్తు పదార్థాలు విక్రయిస్తున్నట్టు సమాచారం అందుకున్న సెబీ అధికారులు, టాస్క్‌ఫోర్సు అధికారులు సంయుక్తంగా దాడులు నిర్వహించారు. విజయనగరం జిల్లా దేశపాత్రునిపాలేనికి చెందిన చందు, పెందుర్తికి చెందిన కె.కళ్యాణ్‌సాయి, ఎం.గణేష్, భీమిలికి చెందిన కల్లా హరిపద్మ రాఘవరావులను అరెస్టు చేసినట్టు అధికారులు తెలిపారు. అనుమతులు లేకుండా కొనుగోలు చేసిన పెంటాజోసిన్ లైన్ లాక్టట్ ఇంజక్షన్లతో పాటు ఓ ద్విచక్రవాహనాన్ని స్వాధీనం చేసుకున్నామన్నారు. వీరికి ఈ ఇంజక్షన్లను సరఫరా చేస్తున్న ఢిల్లీకి చెందిన ఆసిమ్, వెస్ట్ బెంగాల్‌కు చెందిన అనుపమ్‌లను గుర్తించామని చెప్పారు. నిందితులు ఇంజక్షన్లను స్వయంగా వినియోగించడంతో పాటు యువతకు విక్రయిస్తున్నట్టు విచారణలో తేలిందని జాయింట్ డైరెక్టర్ (డీఎస్ఈఓ) శ్రీనివాసరావు తెలిపారు. నిందితులను అరెస్టు చేయడంలో కీలకంగా వ్యవహరించిన సెబీ సూపరింటెండెంట్ బి.శ్రీనాథుడు, సీఐ సీహెచ్‌వీఎస్ ప్రసాద్, ఎస్ఐ శాంతిలక్ష్మి, టాస్క్‌ఫోర్స్ సీఐలు కల్యాణి, చౌదరి, కరణం సురేష్, పెందుర్తి సీఐ సరోజ, భీమిలి సీఐ రామకృష్ణ ఇతర సిబ్బందిని శ్రీనివాసరావు అభినందించారు.

సకాలంలో స్పందన అర్జీల పరిష్కారం



వినతులు స్వీకరిస్తున్న జిల్లా కలెక్టర్ మల్లికార్జున, చిత్రంలో జేసీ విశ్వనాథన్, డీఆర్‌ఓ శ్రీనివాసమూర్తి

మహారాణిపేట (విశాఖ దక్షిణ): స్పందనలో వచ్చిన అర్జీలను నిర్ణీత కాలపరిమితిలోగా పరిష్కరించాలని కలెక్టర్ మల్లికార్జున అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరు కార్యాలయ సమావేశ మందిరంలో స్పందన దరఖాస్తుల పరిష్కారంపై అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్పందన కార్యక్రమానికి ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. దీనిపై జిల్లా అధికారులందరూ ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. అర్జీదారులకు సమాధానం చెప్పే ముందు ఉన్నతాధికారులు క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. రీ ఓపెన్ పిటిషన్లు ఎందుకు వస్తున్నాయో చూసుకొని, పరిష్కారంలో ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. మున్సిపల్ శాఖకు సంబంధించి వీధిలైట్లు, కుళాయి మంజూరు, చెత్త తరలింపు, ట్రేడ్ లైసెన్స్‌లకు అధికంగా అర్జీలు వస్తున్నందున వాటిని పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలన్నారు. సోమవారం నాటి స్పందనలో 175 విజ్ఞప్తులు అందాయి. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి శ్రీనివాస మూర్తి, ఆర్డీవో హుస్సేన్ సాహెబ్, మున్సిపల్ అధికారులు, పోలీస్ అధికారులు, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ముఖ ఆధారిత హాజరు తప్పనిసరి

ప్రభుత్వ కార్యాలయాల్లో ఉద్యోగులందరూ ముఖ ఆధారిత హాజరు యాప్‌లో తమ వివరాలు నమోదు చేసుకోవాలన్నారు. ప్రతి శాఖ విభాగాధిపతులు ఉద్యోగుల హాజరు వివరాలను యాప్‌లో నమోదు చేసేటట్లు చూడాలన్నారు.

ఉద్యోగుల ఆధార్ మార్పులకు ప్రత్యేక కేంద్రం

ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులకు ఆధార్‌లో మార్పులు, చేర్పులకు కలక్టరేట్‌లో మంగళవారం నుంచి మూడు రోజులపాటు ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నామన్నారు. ఆధార్ ప్రత్యేక డ్రైవ్ కేంద్రాన్ని జాయింట్ కలెక్టర్ కె.ఎస్.విశ్వనాథన్ ప్రారంభించారు. ఈ నెల 25న జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రతి ప్రభుత్వ కార్యాలయం, విద్యాసంస్థలలో ఓటర్ల ప్రతిజ్ఞ నిర్వహించాలని కలెక్టర్ మల్లికార్జున ఆదేశించారు. అనంతరం సంజీవని, డిస్ట్రిక్ట్ రిలీఫ్ ఫండ్‌కు రూ.25 వేల చెక్కును జిల్లా పరిషత్ కార్యాలయం తరఫున ముఖ్య కార్యనిర్వహణ అధికారి శ్రీరామమూర్తి కలెక్టర్ మల్లికార్జునకు అందజేశారు.

పోలీస్ స్పందనకు 39 ఫిర్యాదులు

దొండపర్తి: పోలీస్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి 39 ఫిర్యాదులు వచ్చాయి. ఏడీసీపీ(అడ్మిన్) ఎం.ఆర్.కె.రాజు ఫిర్యాదులు స్వీకరించగా.. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సీపీ శ్రీకాంత్ ఫిర్యాదుదారులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వాటిపై సంబంధిత అధికారులతో మాట్లాడి సత్వరమే వాటిని పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని చెప్పారు.

స్పందనకు 40, డయల్ యువర్ మేయర్‌కు 20



స్పందనలో ఫిర్యాదులు స్వీకరిస్తున్న మేయర్ గొలగాని హరి వెంకట కుమారి

డాబాగార్డెన్స్ (విశాఖ దక్షిణ): జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో సోమవారం ఉదయం 10 నుంచి 11 గంటల వరకు నిర్వహించిన డయల్ యువర్ మేయర్ కార్యక్రమానికి 20 ఫిర్యాదులు వచ్చాయి. నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారి టోల్‌ఫ్రీ 18004250009 నంబర్ ద్వారా వీటిని స్వీకరించారు. ప్రధాన ఇంజినీరింగ్ విభాగానికి 10 ఫిర్యాదులు రాగా.. పట్టణ ప్రణాళికా విభాగానికి 2, ప్రజారోగ్యం, సీపీఓ విభాగానికి 4, డీసీ (రెవెన్యూ)కి 2, యూసీడీకి ఒక ఫిర్యాదు వచ్చింది. అదనపు కమిషనర్‌కు ఒక ఫిర్యాదు అందింది.

మూడు రోజుల్లో చర్యలు

స్పందన కార్యక్రమంలో 40 వినతులు వచ్చాయి. వీటిలో జోన్-2కు మూడు, జోన్-3కి పది, జోన్-4కు ఎనిమిది, జోన్-5కు మూడు, జోన్-6కు పది, జోన్-8కి నాలుగు, ప్రధాన కార్యాలయానికి రెండు ఫిర్యాదులు వచ్చాయి. వీటిలో రెవెన్యూకి 3, టౌన్‌ప్లానింగ్‌కు 22, ఇంజినీరింగ్/హార్టికల్చర్‌కు 5, యూసీడీకి 6, ప్రజారోగ్యానికి 4 వినతులు వచ్చాయి. వాటిని పరిశీలించి ఫిర్యాదులను 3 రోజుల్లో పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని మేయర్ హరివెంకట కుమారి, కమిషనర్ రాజాబాబు సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్లు వై.శ్రీనివాసరావు, డాక్టర్ వి.సన్యాసిరావు, ఎస్ఎస్ వర్మ, ప్రధాన వైద్యాధికారి డాక్టర్ కేఎస్ఎల్‌జీ శాస్త్రి, ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్ వాసుదేవరెడ్డి, పట్టణ ప్రణాళికా అధికారి సురేష్, సెక్రటరీ పి.నల్లనయ్య, డీడీ (హార్టీకల్చర్) ఎం.దామోదరరావు, ఎఫ్ఏ అండ్ ఏఓ మల్లికాంబ, డీపీఓ చంద్రిక, డీసీ(రెవెన్యూ) ఫణిరాం, రీజనల్ ఫైర్ ఆఫీసర్ నిరంజన్‌రెడ్డి, యూసీడీ పీఓ సూర్యకళ, పర్యవేక్షక ఇంజనీర్లు, టౌన్‌ప్లానింగ్, యూసీడీ సిబ్బంది పాల్గొన్నారు.

సీఎం జగనన్నకు ప్రత్యేక కృతజ్ఞతలు


సీఎం జగన్‌కు మొక్క అందిస్తున్న ఎమ్మెల్సీ కల్యాణి

మహారాణిపేట (విశాఖ దక్షిణ) : ఇటీవల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మహిళా విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్‌గా తనను నియమించినందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి ఎమ్మెల్సీ వరుదు కల్యాణి కృతజ్ఞతలు తెలిపారు. తాడేపల్లిలో గల నివాసంలో సీఎం జగన్‌మోహన్ రెడ్డిని సోమవారం మర్యాద పూర్వకంగా కలిసి మొక్క అందజేశారు. జగనన్న తనకు అప్పగించిన బాధ్యతలను శక్తి వంచన లేకుండా నిర్వర్తిస్తానని పేర్కొన్నారు.

శ్రీకృష్ణాపురం గురుకులం పీడీ సస్పెన్షన్

ఆరిలోవ (విశాఖ తూర్పు) : శ్రీకృష్ణాపురంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ గురుకులం పీడీ సుధాకర్ సస్పెన్షన్‌కు గురయ్యారు. ఇటీవల కొందరు ఇంటర్ విద్యార్థులు పదో తరగతి విద్యార్థిపై దాడికి పాల్పడిన సంఘటన తెలిసిందే. ఈ సంఘటనపై సాంఘిక సంక్షేమ శాఖ ఉన్నతాధికారులు సైతం ఆందోళనకు గురిచేసింది. దీనిపై ఆ శాఖ కార్యదర్శి ఆర్.పావనమూర్తి దర్యాప్తునకు ఆదేశించారు. ఈనెల 10న జాయింట్ సెక్రటరీ ఎస్.సంజీవరావు గురుకులాన్ని సందర్శించి గొడవకు గల కారణాలు, సిబ్బంది నిర్లక్ష్యం తదితర అంశాలతో కూడిన నివేదికను కార్యదర్శికి అందజేశారు. దీంతో బాధ్యుడైన ఫిజికల్ డైరెక్టర్ సుధాకర్‌ను సస్పెండ్ చేస్తూ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆయనతో పాటు పర్యవేక్షణ లోపం ఉన్న ప్రిన్సిపాల్ ఫ్లోరెన్స్‌కు షోకాజ్ నోటీస్ ఇచ్చారు. పీడీ సుధాకర్‌కు సస్పెన్షన్ ఆర్డర్ అందజేసినట్టు ప్రిన్సిపాల్ ఫ్లోరెన్స్‌కు తెలిపారు. ఇదిలావుండగా విద్యార్థుల మధ్య గొడవ జరిగిన రోజున విధుల్లో ఉండాల్సిన పీడీ గైర్హాజరైనట్టు తెలిసింది. ఈ విషయాన్ని కూడా నివేదికలో పొందుపరిచారని, అందుకే ఆయనను సస్పెండ్ చేశారని తెలుస్తోంది.

బాలికా...బెంగలేదిక..!

- లైంగిక వేధింపులకు అడ్డుకట్ట
- పాఠశాలలు, కాలేజీల్లో 'భరోసా బాక్స్'
- సమస్యల పరిష్కరించేందుకు ప్రత్యేక కమిటీ
- ఆడపిల్లలకు అండగా నిలవడమే లక్ష్యం
- రక్షణ చట్టాలు పటిష్టంగా అమలు
- బాలిక విద్యకు ప్రోత్సాహమందిస్తున్న వైఎస్సార్ సీపీ ప్రభుత్వం
- నేడు జాతీయ బాలికా దినోత్సవం

పాఠశాలలు, కళాశాలల్లో చదువుకునే బాలికలకు ఏది గుడ్‌టచ్....ఏది బ్యాడ్ టచ్ అనేది తెలుసుకునేలా అవగాహన కల్పించేందుకు జిల్లా విద్యాశాఖ నడుంబిగించింది. 11–18 ఏళ్ల మధ్య గల బాలికలకు భరోసా కల్పించడమే లక్ష్యంగా 'వైఎస్సార్ కిశోరి వికాసం' అనే కార్యక్రమాన్ని పటిష్టంగా అమలు చేసేలా ప్రభుత్వం దృష్టి సారించింది. బాలికలపై జరుగుతున్న లైంగిక వేధింపులకు పూర్తిగా అడ్డుకట్ట వేయాలనే ప్రభుత్వ ఆదేశాలతో విద్య, వైద్య, స్త్రీ శిశు సంక్షేమశాఖాధికారులు సంయుక్తంగా విశాఖ జిల్లాలో చేపడుతున్న కార్యక్రమాలు సత్ఫలితాలిస్తున్నాయి.

– విశాఖ విద్య




మధురానగర్ స్కూల్లో ఏర్పాటు చేసిన భరోసా బాక్స్, పాఠశాల నుంచి వస్తున్న విద్యార్థినులు

జిల్లాలోని ప్రతి పాఠశాలలో హెచ్ఎం గదికి సమీపంలో అందరికీ కనిపించేలా బాలికల కోసం 'భరోసా బాక్స్' ఏర్పాటు చేశారు. బాక్స్‌కు తాళం వేసి, దానిని ప్రతి 15 రోజులకొక సారి సచివాలయ మహిళా పోలీసు, వైద్యారోగ్యశాఖ ఏఎన్ఎం సమక్షంలో తెరుస్తున్నారు. ఫిర్యాదులు, సూచనలు, సలహాలు ఉంటే, చీటీ వేసిన వారి వివరాలను గోప్యంగా ఉంచి, దాని పరిష్కారం కోసం ఎంఈవోల దృష్టికి తీసుకెళ్తున్నారు.

యుక్త వయస్సు సమస్యలపై ఫోకస్

బాలికలు ఎదుర్కొనే ఇబ్బందులతో పాటు, భవిష్యత్‌లో గృహిణిగా ఎదురయ్యే సమస్యలను కూడా ఎలా అధిగమించాలనే దానిపై అవగాహన కల్పిస్తున్నారు. ఏఎన్ఎం, అంగన్‌వాడీ కార్యకర్త, సచివాలయ విద్య కార్యదర్శి, మహిళా పోలీసు, పాఠశాల హెచ్ఎంతో కూడిన ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేశారు. ప్రధానంగా తొమ్మిది అంశాలపై ఫోకస్ పెట్టారు. బాల్య వివాహాలు, పిల్లల దుర్వినియోగం, పిల్లల అక్రమ రవాణా, రక్త హీనత పోషణ, అమ్మాయిల రుతు పరిశుభ్రత నిర్వహణ, మహిళలు పిల్లల పథకాల కార్యకలాపాలు, మహిళల రక్షణకు 181– హెల్ప్‌లైన్ కేంద్రాలు, వార్డు, గ్రామ, సచివాలయాల సెక్రటరీల పాత్ర, మహిళా మిత్ర, సైబర్ మిత్ర వంటి అంశాలపై అవగాహన కల్పిస్తున్నారు.

అంతరాన్ని అంతం చేసేలా..

జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు యాజమాన్యాల పరిధిలోని 1,399 పాఠశాలల్లో ఒకటి నుంచి పదో తరగతి వరకు 3,53,398 మంది విద్యనభ్యశిస్తున్నారు. ఇందులో బాలురు 1,86,415 మంది కాగా, బాలికలు 1,66,983 మంది ఉన్నారు. ఈ లెక్కన పాఠశాల స్థాయి వయస్సు ఉన్న విద్యార్థుల్లో బాలుర కంటే బాలికలు 18,432 మంది తక్కువగా ఉన్నారు. బాలికల నిష్పత్తిని పెంచేలా విద్య, స్త్రీ శిశు సంక్షేమశాఖల భాగస్వామ్యంతో వైద్యశాఖ ఆధ్వర్యంలో ప్రజానీకంలో చైతన్యం తీసుకొచ్చేందుకు పెద్ద ఎత్తున కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు.

బాలికలకు జగనన్న ఇచ్చిన తోడు ఇవే..

చైల్డ్‌లైన్	1098
ఏపీ పోలీసు	100
దిశ	112
ఉమెన్ హెల్ప్‌లైన్	181
ఎమర్జెన్సీ	108
మెడికల్ హెల్ప్‌లైన్	104

పటిష్టమైన చర్యలు



బాలికలకు భరోసాగా నిలవాలనేది ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆశయం. బాలికలపై లైంగిక వేధింపులకు పాల్పడినట్లు తెలిస్తే కఠిన చర్యలు తీసుకుంటున్నాం. ప్రభుత్వ, ప్రైవేటు యాజమాన్యాల పరిధిలోని అన్ని పాఠశాలల్లో భరోసా బాక్స్‌లను వెంటనే ఏర్పాటు చేయాలని ఆదేశాలిచ్చాం. డిప్యూటీ డీఈవో, ఎంఈవోలు దీనిపై పర్యవేక్షిస్తారు

– ఎల్. చంద్రకళ, డీఈవో, విశాఖ జిల్లా

బాలికలకు భరోసా కల్పిస్తున్నాం



ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల్లో చదువుకునే బాలికలకు ఏ విధమైన ఇబ్బందులు లేకుండా పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నాం. నగరంలో బాలికల కళాశాల ప్రాంగణాల్లో సీసీ కెమెరాలను సైతం ఏర్పాటు చేయించాం. బాలికలు ఉన్నత విద్య వైపు వచ్చేలా ప్రోత్సహిస్తున్నాం. ఇంటర్మీడియెట్ బోర్డు ద్వారా కాలేజీల్లో తగిన అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నాం.

– ఆర్. సత్యనారాయణ, ఆర్ఐవో, ఉమ్మడి విశాఖ జిల్లా

ధైర్యంగా బడికి



మా బడిలో సకల సౌకర్యాలు ఉన్నాయి. ఆడపిల్లలనే వ్యత్యాసం చూపకుండా మా స్కూల్లో అన్నీ తెలిసేలా చెబుతారు. టీచర్లు ఎంతో స్నేహంగా ఉంటూ, పాఠాలు చెబుతున్నారు. బడిలో భోజనం కూడా ఎంతో రుచిగా ఉంటుంది. బడికి ధైర్యంగా వస్తున్నాం. స్నేహితులమంతా కలసి మెలసి ఉంటూ చదువుకుంటున్నాం.

– ఎల్.మంజుల శ్రీ, 7వ తరగతి, ప్రకాశరావు పేట స్కూల్, విశాఖ అర్బన్

బాలిక విద్యకు ప్రోత్సాహం



బాలిక విద్యను ప్రోత్సహించేలా సమగ్ర శిక్ష అభియాన్ ద్వారా కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. బాలికల డ్రాపవుట్ ఉన్నట్లయితే, వెంటనే ప్రత్యేక టీమ్ వారి వద్దకు వెళ్లి సమస్యను తెలుసుకుంటుంది. బాలిక విద్యను ప్రోత్సహించేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నాం.

– వానపల్లి శైలజ, ప్రత్యామ్నాయ పాఠశాలల జిల్లా కో–ఆర్డినేటర్, విశాఖ జిల్లా

నగర సుందరీకరణకు మేయర్ ఆదేశం


వరుణ్‌బీచ్ పార్క్ సుందరీకరణపై చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశిస్తున్న మేయర్

డాబాగార్డెన్స్ (విశాఖ దక్షిణ): విశాఖలో ప్రతిష్టాత్మక జి–20 సదస్సు నేపథ్యంలో నగర సుందరీకరణపై అధికారులు దృష్టి సారించాలని నగర మేయర్ గొలగాని హరివెంకటకుమారి పేర్కొన్నారు. సోమవారం ఆమె బీచ్‌రోడ్డులోని వరుణ్ బీచ్ పార్క్ తదితర ప్రాంతాల్లో జీవీఎంసీ ఇంజినీరింగ్ అధికారులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ మార్చిలో జి–20 సదస్సు జరుగుతున్నందున నోవాటెల్ హోటల్లో ప్రముఖులు బస చేయనున్న నేపథ్యంలో ఆ ప్రాంత రోడ్లపై అధికారులు దృష్టి సారించాలన్నారు. గతంలో ఇక్కడ గోడ కూలిన విషయం తెలిసిందేనని, తక్షణమే ఆయా ప్రాంతాల్లో మరమ్మతులతో పాటు పెయింటింగ్, సుందరీకరణ పనులు చేపట్టాలని, అందుకు అంచనాలు తయారుచేసి స్థాయీ సంఘం ఆమోదానికి పంపించాలన్నారు. ఈ పర్యటనలో ప్రధాన ఇంజినీరు రవికృష్ణరాజు, పర్యవేక్షక ఇంజినీరు సత్యనారాయణరావు, కార్యనిర్వాహక ఇంజినీరు బీవీ రమణ, ఉప కార్యనిర్వాహక ఇంజినీరు సత్యనారాయణ, అసిస్టెంట్ ఇంజినీరు తేజ తదితరులు పాల్గొన్నారు.

పోర్టులో పుష్ప

కొమ్మాది : సినీ హీరో అల్లు అర్జున్ షిప్‌యార్డ్, పోర్టు తదితర ప్రాంతాల్లో సందడి చేస్తున్నారు. సుకుమార్ దర్శకత్వంలో తెరకెక్కిస్తున్న పుష్ప–2 (ది రూల్) సినిమాకు సంబంధించిన కొన్ని సన్నివేశాలను ఇక్కడ కంటైనర్లలో చిత్రీకరిస్తున్నారు. మైత్రి మూవీ మేకర్స్ బ్యానర్‌పై నిర్మిస్తున్న ఈ సినిమాకు దేవిశ్రీ ప్రసాద్ సంగీతం అందిస్తున్నారు. ఈ సినిమా షూటింగ్ మరో వారం రోజుల పాటు ఈ ప్రాంతాల్లో జరగనుంది.

మూర్తి యాదవ్‌పై కేసు నమోదు

బీచ్‌రోడ్డు (విశాఖ తూర్పు): జనసేన పార్టీ కార్పొరేటర్ పీతల మూర్తి యాదవ్‌పై మూడో పట్టణ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. సోమవారం జీవీఎంసీ కార్యాలయం వద్ద మూర్తి యాదవ్ ఆందోళన నిర్వహించగా.. అధికారుల విధులకు ఆటంకం ఏర్పడింది. దీంతో అధికారుల ఫిర్యాదు మేరకు మూడో పట్టణ పోలీసులు జీవీఎంసీకి చేరుకొని మూర్తి యాదవ్‌ను అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు ఆయనపై కేసు నమోదు చేసి కోర్టు ఎదుట హాజరు పరిచారు.

25న ఓటర్ల చైతన్య మహాసభ

డాబాగార్డెన్స్(విశాఖ దక్షిణ): జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 25న ఎంవీపీ కాలనీ ఏఎస్ రాజా గ్రౌండ్స్‌లో ఓటర్ల చైతన్య మహాసభ నిర్వహించనున్నట్టు ఓటర్స్ ఫోరం ఫర్ బెటర్ డెమోక్రసీ జాతీయ అధ్యక్షుడు నూకల సూర్యప్రకాష్ తెలిపారు. సోమవారం వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో ఆయన మాట్లాడారు. ప్రజాస్వామ్యాన్ని రక్షించుకోవాలన్నా, దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపించుకోవాలన్నా, సమాజాన్ని, జాతిని తీర్చిదిద్దుకోవాలన్నా ఓటే కీలకమన్నారు. దేశంలో జరిగే అన్ని ఎన్నికల్లో ప్రజలంతా ఏ విధమైన ప్రలోభాలకు లోనుకాకుండా ఓటు వేసేలా అవగాహన కల్పించడమే లక్ష్యంగా ఓటర్స్ ఫోరం ఫర్ బెటర్ డెమోక్రసీ పనిచేస్తుందన్నారు. ఓటర్లను చైతన్య పరిచేందుకు నిర్వహించనున్న చైతన్య మహాసభకు ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి పెద్ద సంఖ్యలో ఓటర్లు పాల్గొనాలని కోరారు. ఈ సభకు సీబీఐ మాజీ జేడీ వి.వి.లక్ష్మీనారాయణ, ఎస్.శ్రీధర్, దత్తాత్రేయ, బాలగంగాధర్ తిలక్, ఆదిభట్ల భాస్కర్, కూరెళ్ల శ్రీనివాసరావు, పలువురు ప్రముఖులు పాల్గొంటున్నట్టు తెలిపారు.

ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ గడువు పెంపుపై హర్షం


హర్షం వ్యక్తం చేస్తున్న దళిత సంఘాలు, దళిత జేఏసీ

డాబాగార్డెన్స్: ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ గడువు మరో పదేళ్లు పొడిగించడంపై దళిత సంఘాలు హర్షం వ్యక్తం చేశాయి. సోమవారం డాబాగార్డెన్స్ అంబేడ్కర్ విగ్రహం వద్ద దళిత సంఘాలు చేపట్టిన కార్యక్రమంలో డీహెచ్‌పీఎస్, కేవీపీఎస్, దళిత సంఘాల జేఏసీ, స్టీల్‌ప్లాంట్ ఎస్సీ ఎస్టీ అసోసియేషన్ తదితర సంఘాల నాయకులు పాల్గొని హర్షం వ్యక్తం చేశారు. దళితుల అభివృద్ధికి, స్వయం ఉపాధికి, దళిత యువతను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దడానికి, భూమి కొనుగోలుకు ఈ సబ్‌ప్లాన్ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జునకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో డీహెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు జేవీ ప్రభాకర్, బొడ్డు కల్యాణరావు, టి.చిరంజీవి, పతివాడ రాంబాబు, కేవీపీఎస్ నాయకులు జి.రాంబాబు, దళిత జేఏసీ బయ్యే మల్లయ్య పాల్గొన్నారు.

వేలం ద్వారా అప్పన్నకు రూ.22.66 లక్షల ఆదాయం


వేలం పాట నిర్వహిస్తున్న దేవస్థానం అధికారులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానంలో పలు వ్యాపారాలు చేసుకునేందుకు ఫిబ్రవరి 1 నుంచి 28 వరకు లైసెన్స్ హక్కులు ఇచ్చేందుకు సోమవారం నిర్వహించిన బహిరంగ వేలం పాట ద్వారా దేవస్థానానికి రూ.22,66,900 ఆదాయం లభించింది. కొండ దిగువ దేవస్థానం పరిపాలన కార్యాలయంలో బహిరంగ వేలం పాట నిర్వహించారు. సింహగిరిపై భక్తులు సమర్పించిన సన్నిధి ఫలాలు, కొబ్బరి చెక్కలు తీసుకునేందుకు సంబంధించి 2.80 లక్షలు, కొబ్బరికాయల విక్రయానికి సంబంధించి 5.26 లక్షలు, భక్తుల సెల్‌ఫోన్లు భద్రపరిచేందుకు 4.53 లక్షలు, క్లాక్ రూమ్ నిర్వహణకు 2.69 లక్షలు, ఐస్‌క్రీమ్ విక్రయానికి రూ.1.37లక్షలు, కొండ దిగువన తొలిపావంచా వద్ద కొబ్బరిచెక్కలు తీసుకునేందుకు సంబంధించి రూ.1.83 లక్షలు, భైరవవాకలోని భైరవస్వామి వద్ద కొబ్బరికాయలు, పూజాసామాగ్రి, దీపాలు విక్రయానికి, కొబ్బరి చెక్కలు తీసుకునేందుకు రూ.3.50 లక్షలు, గురువారం సంతలో ఆశీలు వసూలు చేసుకునేందుకు రూ.11,100, గోపాలపట్నంలోని బుధవారం సంతలో ఆశీలు వసూలుకు రూ.10,400, బుధవారం మినహా మిగతా రోజుల్లో ఆశీలు వసూలు చేసుకునేందుకు రూ.10,400, వరాహ పుష్కరిణి వద్ద కొబ్బరికాయలు, పూజా సామాగ్రి విక్రయానికి రూ.37వేల హెచ్చు మొత్తానికి పాటదారులు పాడారు. దేవస్థానం ఏఈవోలు శ్రీనివాసమ్, ఇజిరోతు శ్రీనివాసరావు, సూపరింటెండెంట్ నిద్దాం నాయుడు, సిబ్బంది దొంతల రమణ పాల్గొన్నారు.

రాముని పేరిట మంచి చేద్దాం


మాట్లాడుతున్న ఉడిపి పేజావర అథోక్షజ మఠం పీఠాధిపతి విశ్వ ప్రసన్న తీర్థస్వామి

- ఉడిపి పేజావర అథోక్షజ మఠం పీఠాధిపతి విశ్వ ప్రసన్న తీర్థ స్వామి

డాబాగార్డెన్స్ (విశాఖ దక్షిణ): శ్రీరాముడు పేరిట ప్రతి ఒక్కరూ మంచి పని చేయాలని, అప్పుడే రామరాజ్యం వస్తుందని ఉడిపి పేజావర అథోక్షజ మఠం పీఠాధిపతి విశ్వ ప్రసన్న తీర్థస్వామి పిలుపునిచ్చారు. విశాఖ విచ్చేసిన స్వామి సోమవారం నగరంలోని రామ్‌నగర్‌లో గల రాఘవేంద్రస్వామి మఠాన్ని సందర్శించిన అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అయోధ్యలో శ్రీరామ మందిరం సాకారమైందని, అయితే మందిరంతో పాటు రామరాజ్యం రావాలన్నారు. అందుకు ప్రతి ఒక్కరూ శ్రీరాముని సద్గుణాలు స్వీకరించి ప్రతి గ్రామంలో మంచి పనులు చేస్తే అదే రామరాజ్యమవుతుందని చెప్పారు. మన ప్రయత్నం వల్ల మరొకరికి మంచి జరిగితే అదే ధర్మమని పేర్కొన్నారు. అందరి సుఖం కోరే పనులు చేస్తే అదే రామరాజ్యమన్నారు. అనాథ పిల్లలను దత్తత తీసుకుని వారికి ఉచిత విద్యనందించడం, గోశాలలో ఆవుల్ని దత్తత తీసుకుని పరిరక్షించడం.. ఇలా పది మందికి సేవలు చేయడం ద్వారా కూడా రామరాజ్యం వస్తుందన్నారు. 60 ఏళ్ల కిందట ఉడిపిలో గోశాలలు ప్రారంభించామని, అలాగే పలువురు అనాథ పిల్లల్ని దత్తత తీసుకుని ఉచిత విద్య అందిస్తున్నట్టు చెప్పారు. సమావేశంలో ప్రముఖ ఆధ్యాత్మికవేత్త ఎంవీ రాజశేఖర్, రాఘవేంద్రస్వామి మఠం ప్రతినిధులు కె.పవన్‌కుమార్ ఆచార్య సీహెచ్ ముఖ్యప్రాణారావు, కేవీ నరసింహారావు, ఎ.లక్ష్మణరావు పాల్గొన్నారు.

శభాష్ సాత్విక్


మాట్లాడుతున్న సాత్విక్

బీచ్‌రోడ్డు (విశాఖ తూర్పు): స్వామి వివేకానంద స్ఫూర్తితో నేతాజీ సుభాష్ చంద్రబోస్ బ్రిటిష్ వారిపై స్వాతంత్ర్య పోరాటం చేశారని బలభద్రుని నాగ సాత్విక్ అన్నారు. నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతిని పురస్కరించుకొని నిర్వహిస్తున్న జాతీయ స్థాయి వక్తృత్వ పోటీలకు ఏయూ న్యాయ కళాశాల విద్యార్థి బలభద్రుని నాగ సాత్విక్ ఎంపికయ్యారు. సోమవారం ఢిల్లీలో జరిగిన ఈ పోటీల్లో చంద్రబోస్ గొప్పదనాన్ని చాటిచెప్పిన.. సాత్విక్ ఆహూతులను మెప్పించారు. చివరిగా నేతాజీ గీతాన్ని ఆలపించి ప్రేక్షకుల్లో ఉత్సాహాన్ని నింపారు.

జీ–20 సదస్సుకు పకడ్బందీ భద్రత

- హోటళ్లు, పర్యాటక ప్రాంతాల్లో నిఘా
- అన్ని శాఖల అధికారులతో సెక్యూరిటీ ఆడిట్ నిర్వహించిన సీపీ శ్రీకాంత్

దొండపర్తి: జీ–20 సదస్సుకు భారీ భద్రతా ఏర్పాట్లపై నగర పోలీస్ శాఖ దృష్టి సారించింది. దేశ, విదేశాల నుంచి పెద్ద సంఖ్యలో ప్రముఖులు, ప్రతినిధులు విశాఖ వస్తున్న నేపథ్యంలో ఇప్పటి నుంచే నిఘా ఏర్పాటు చేస్తున్నారు. ఇందులో భాగంగా నగర పోలీస్ కమిషనర్ సి.హెచ్.శ్రీకాంత్ ఇంటెలిజెన్స్ సెక్యూరిటీ వింగ్ ఓఎస్‌డీ టి.వి.శశిధర్‌రెడ్డితో పాటు పోలీస్, వీఎంఆర్‌డీఏ, జీవీఎంసీ, ఏపీ టూరిజం, ఇతర శాఖల అధికారులతో సోమవారం సెక్యూరిటీ ఆడిట్ నిర్వహించారు. సదస్సుకు వచ్చే దేశ, విదేశీ ప్రతినిధులు బస చేసే హోటళ్లు, వారు పర్యటించే పర్యాటక ప్రాంతాల్లో చేపట్టాల్సిన భద్రతా చర్యలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన ప్రాంతాలను సందర్శించి అక్కడ బందోబస్తు ఏర్పాట్లతో పాటు ట్రాఫిక్, పార్కింగ్ ఏర్పాట్లపై అధికారులకు పలు సూచనలు చేశారు.

పర్యాటక ప్రాంతాల్లో పర్యటన

కొమ్మాది: భీమిలి బీచ్ రోడ్డు, మంగమారిపేట వద్ద గల తొట్లకొండను నగర పోలీసు కమిషనర్ సీహెచ్ శ్రీకాంత్ సోమవారం సందర్శించారు. పర్యాటక ప్రాంతాల్లో కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేయాలని పోలీసు అధికారులను ఆదేశించారు. కైలాసగిరి, ఆర్‌కేబీచ్, రుషికొండ బీచ్‌లతో పాటు తొట్లకొండను కూడా సుందరంగా తీర్చిదిద్దాలని సూచించారు. కార్యక్రమంలో పురావస్తుశాఖ ఏడీ శ్రీనివాసరావు, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

పందులను తరలించండి


జీవీఎంసీ సిబ్బంది స్వాధీనం చేసుకుని తరలిస్తున్న పందులు

అల్లిపురం (విశాఖ దక్షిణ): నగర పరిశుభ్రత, ప్రజల ఆరోగ్య దృష్ట్యా స్వచ్ఛందంగా పందులను తరలించాలని పెంపకదారులను జీవీఎంసీ కమిషనర్ పి.రాజాబాబు సోమవారం హెచ్చరించారు. ఇప్పటికే నగరంలో పందుల నిర్మూలనకు జీవీఎంసీ ప్రత్యేక డ్రైవ్ చేపడుతోందన్నారు. పెంపకం దారులను పలుమార్లు హెచ్చరించినప్పటికీ వారిలో ఎటువంటి మార్పు కనిపించడం లేదన్నారు. ఇకపై వారిపై కఠినంగా వ్యవహరిస్తామన్నారు. సోమవారం గాజువాక, జ్ఞానాపురం, మధురవాడ తదితర ప్రాంతాలలో సుమారు 600 వరకు పందులను పులివెందుల నుంచి వచ్చిన టీం ద్వారా పట్టించి ఇతర రాష్ట్రాలకు తరలించామన్నారు. 140 పందులను జీవీఎంసీ వెటర్నరీ డాక్టర్ ఎస్.కిషోర్, ఆయా జోన్ల ఏఎంఓహెచ్‌ల ఆధ్వర్యంలో కాల్చి చంపడం జరిగిందన్నారు. ముఖ్యమంత్రి నగర పర్యటన, జి–20 సదస్సు మార్చి నెలలో జరుగుతున్న నేపథ్యంలో నగరం నుంచి పందులను పూర్తిగా నిర్మూలిస్తామన్నారు.

ఒత్తిడి జయించేందుకు 'పరీక్ష పే'

ఉత్సాహంగా స్పాట్ పెయింటింగ్ పోటీలు


కార్యక్రమ ప్రారంభోత్సవంలో మాట్లాడుతున్న కేవీ వాల్తేర్ ప్రిన్సిపాల్ కమల్‌జీత్

తాటిచెట్లపాలెం(విశాఖ ఉత్తర): ప్రధాని నరేంద్ర మోదీ ప్రారంభించిన పరీక్ష పే చర్చ కార్యక్రమంలో భాగంగా సోమవారం కేంద్రీయ విద్యాలయ, వాల్తేర్‌లో స్పాట్ పెయింటింగ్ పోటీలు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కేంద్రీయ విద్యాలయ వాల్తేర్ కమల్ జీత్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు పరీక్షల సమయంలో ఒత్తిడితో కాకుండా సానుకూల వాతావరణంలో సిద్ధంగా కావాలన్నారు. దేశవ్యాప్తంగా గల కేంద్రీయ విద్యాలయాల్లో ఒక్కో స్కూల్‌లో 100మందితో ఈ స్పాట్ పెయింటింగ్ పోటీలను సోమవారం నిర్వహించినట్టు తెలిపారు. జిల్లాలోని ఇతర కేంద్రీయ విద్యాలయాలు, జవహర్ నవోదయ విద్యాలయ, స్టేట్ బోర్డు పాఠశాలల, సీబీఎస్‌ఈ పాఠశాలల నుంచి సుమారు 100మంది విద్యార్థులు సోమవారం జరిగిన పోటీలలో పాల్గొన్నారు.

పోటీలో పాల్గొన్న విద్యార్థులందరికీ డిజిటల్ సర్టిఫికెట్లు, పరీక్ష వారియర్ పుస్తకాలను అందించనున్నారు. ప్రతి పాఠశాలలో ఐదుగురు విజేతలకు ప్రత్యక్షంగా సర్టిఫికెట్లు, జాతీయ స్వాతంత్ర్య సమరయోధుల పుస్తకాలను అందించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కరిక్యులర్ యాక్టివిటీస్ ఇంచార్జి టీచర్ జయలత, ఆర్ట్ టీచర్ ఎల్‌వీ రాంబాబు పర్యవేక్షించగా, కార్యక్రమానికి న్యాయనిర్ణేతలుగా ఆంధ్రాయూనివర్సిటీ బ్యాచిలర్ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ విభాగాధిపతి సింహాచలం, కేంద్రీయ విద్యాలయ, ఎన్ఏడీ ఆర్ట్ టీచర్ బిశ్వజిత్, విద్యావేత్త డాక్టర్ డి.వి జయ వ్యవహరించారు.